జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 19-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 732 పేజీలు: 4 వెల : రూ.7



- నరసన్నపేటలో గొడవ.. కాశీబుగ్గలో సెటిల్‌మెంట్లు!
- 'జనరల్ కానిస్టేబుల్' చక్రం.. ఎస్పీ ఆదేశాలు బేఖాతరు?
- హిట్ అండ్ రన్ కేసులో కథ తిప్పింది 'కలెక్షన్ కింగ్' మోహనే?
- నిఘా నీడలో మరో ఐదుగురు సిబ్బంది..
- త్వరలోనే 'బాస్' టేబుల్‌పైకి చిట్టా!




# కాశీబుగ్గ ఖాకీవనం..
# అవినీతి గుట్టురట్టు!



శ్రీకాకుళం, జులై 18 (వార్త): కాశీబుగ్గ హిట్ అండ్ రన్ వ్యవహారం జిల్లా పోలీసు శాఖలో పెను భూకంపమే సృష్టిస్తోంది. కేవలం ఎస్ఐ సునీల్ వి.ఆర్. బదిలీతో ముగిసిపోతుందని భావించిన ఈ వ్యవహారంలో, తెరవెనుక అసలు కథ నడిపిన కొందరు కానిస్టేబుళ్ల బాగోతం ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. అవినీతిరహిత పాలన కోసం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఏ పోలీస్ స్టేషన్‌లోనూ 'జనరల్ కానిస్టేబుల్' వ్యవస్థ ఉండడానికి వీల్లేదని కచ్చితమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కాశీబుగ్గ స్టేషన్‌లో మాత్రం ఓ కానిస్టేబుల్ సామ్రాజ్యాన్ని నడిపిస్తూ ఎస్పీ మాటలనే బేఖాతరు చేయడం ఇప్పుడు పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఎచ్చెర్ల టు కాశీబుగ్గ.. కలెక్షన్ల ప్రస్థానం!

ఈ వ్యవహారంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు పి.సి. నంబర్ 2063 కె.మోహన్. తొలుత ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో జనరల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన కాలంలోనే ఇతగాడికి వసూళ్ల రుచి మరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత నరసన్నపేట పోలీస్ స్టేషన్‌కు మారిన మోహన్, అక్కడ కూడా లావాదేవీల విషయంలో మరో జనరల్ కానిస్టేబుల్‌తో గొడవ పడి, అది కాస్తా కొట్టుకునే వరకు వెళ్లడంతో నాటి ఉదంతం ఎస్పీ దృష్టికి చేరింది. దీంతో ఇతడిని కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అయితే, కాశీబుగ్గలో తొలుత ఇతని ఆటలకు అడ్డుకట్ట పడినప్పటికీ, గతంలో ఎచ్చెర్లలో పనిచేసిన పరిచయంతో కొత్తగా వచ్చిన సీఐ రామకృష్ణ హయాంలో మళ్లీ స్టేషన్ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకున్నట్లు సమాచారం. హైవేపై వెళ్లే వాహనాల డీలింగ్స్, బాధితుల నుంచి వసూళ్లు, చివరకు ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చే పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలోనూ చేయి చాపడం ఇతనికి అలవాటుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ప్రమాదం రాత్రి.. కథ మార్చింది ఇతనేనా?

ఈ నెల 10వ తేదీ రాత్రి గొర్రెల కాపరి దానయ్య ప్రమాదంలో చనిపోయిన రాత్రి, నైట్ డ్యూటీలో ఉన్న తిరుపతి అనే కానిస్టేబుల్ సమాచారాన్ని వెంటనే సీఐకి చేరవేసే ప్రయత్నం చేశారు. అయితే సీఐ ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వాస్తవాలు సేకరించే లోపే రంగంలోకి దిగిన మోహన్.. వైసీపీ నాయకులతో వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతూ, డబ్బుల సాయంతో కేసు మొత్తాన్ని పక్కదారి పట్టించేలా చక్రం తిప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పేరు చెప్పుకుని సకల సదుపాయాలు సమకూరుస్తూ, చివరకు ఎస్ఐ, సీఐల పదవులకే ఎసరు పెట్టేలా ఈ 'కలెక్షన్ కింగ్' వ్యవహరించాడనే చర్చ సాగుతోంది.

## డీఐజీకి చేరిన ఐదుగురి చిట్టా.. మరికొన్ని వికెట్లు డౌన్?

గురువారం రాత్రి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విశాఖ రేంజ్ డీఐజీ జరిపిన సుదీర్ఘ సమీక్షలో ఈ అంతర్గత వసూళ్ల సామ్రాజ్యంపై కీలక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో చక్రం తిప్పుతున్న ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక జనరల్ కానిస్టేబుల్, ఒక ఏఎస్ఐ.. మొత్తం ఐదుగురితో కూడిన 'చిట్టా' సిద్ధమై బాస్ టేబుల్‌పైకి వెళ్లినట్లు భోగట్టా. ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు చెడ్డపేరు తెస్తూ, పోలీస్ స్టేషన్‌ను సొంత అడ్డాగా వాడుకుంటున్న వీరిపై కూడా త్వరలోనే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు వెలువడుతుండటంతో కాశీబుగ్గ ఖాకీ తోటలో వణుకు మొదలైంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఇజ్రాయెల్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జులై 18 (వార్త):** ఇజ్రాయెల్‌లో ఒప్పంద ప్రాతిపదికన నర్సింగ్ సెక్టార్-6ఎ లో పనిచేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు (ఈడీ) కె.వినాయకం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, 25 నుంచి 45 ఏళ్ల లోపు వయసున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,99,700 చొప్పున వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ (సాఫ్ట్ స్కిల్స్), నర్సింగ్ స్కిల్స్‌తో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం శ్రీకాకుళంలోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో లేదా మొబైల్ నంబరు 9704895271 లో సంప్రదించాలని ఈడీ కోరారు.

# ఖరీఫ్‌నకు.. సాగునీరు విడుదల

- 24 ఎన్‌బీసీ బ్రాంచ్ కెనాల్ ఎల్ఎంసీ ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
- 37,650 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని వెల్లడి



**జలుమూరు, జులై 18 (వార్త):** ప్రస్తుత ఖరీఫ్ సాగు సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం జలుమూరు మండలం పెద్దదూగాం పరిధి లోని 24 ఎన్‌బీసీ బ్రాంచ్ కెనాల్ ఎల్ఎంసీ (లెఫ్ట్ మెయిన్ కెనాల్) ద్వారా ఆయన అధికారికంగా సాగునీటిని విడుదల చేశారు. కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసిన అనంతరం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చనతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులు, కూటమి నాయకులతో కలిసి కాలువ పరిస్థితులను పరిశీలించి నీటి పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యత ఇస్తోందన్నారు. సాగునీటి కాలువల ఆధునికీకరణ, పూడిక తీత, మరమ్మతు పనులను ముందుగానే పూర్తి చేసి ఖరీఫ్ సాగుకు అనుకూల పరిస్థితులు కల్పించినట్లు తెలిపారు. 24 ఎన్‌బీసీ బ్రాంచ్ కెనాల్ ఎల్ఎంసీ ద్వారా విడుదలైన సాగునీరు జలుమూరు మండలంతో పాటు నరసన్నపేట, పోలాకి మండ లాల పరిధిలోని సుమారు 37,650 ఎకరాల వ్యవసాయ భూము లకు అందుతుందని చెప్పారు. ప్రతి ఎకరాకు సాగునీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహ కరిస్తోందని పేర్కొన్నారు. కాలువల వెంబడి నీటి వృథా, అక్రమ మళ్లింపులు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవే క్షించాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, సాగునీటి పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జలవనరుల శాఖ ఈఈ, సహాయక ఇంజనీర్లు (ఏఈలు), క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ బలోపేతానికి..
# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపు
- ఆయనను మబగాంలో మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

**పోలాకి, జులై 18 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం పోలాకి మండలం మబగాంలో మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు తంగుడు జోగారావు, నియోజక వర్గ అధ్యక్షుడు వైశ్య రాజు కేశవరాజు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశా లపై చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను విస్తృ తంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలతో నిరంత రం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం జిల్లా కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు ధర్మాన కృష్ణదాస్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# యూటీఎఫ్‌తోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

- మందసలో ముఖ్య కార్యకర్తల సమావేశం
- టెట్ ప్రత్యేక స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

**మందస, జులై 18(వార్త):** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మందస మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తలు, కార్యవర్గ సమావేశం జరిగింది. మందస పట్టణం లోని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వ హించిన ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య అధ్యక్షత వహించగా, సంఘ భవిష్యత్ కార్యాచరణను ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు ప్రవేశపెట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు, రాష్ట్ర కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి జయరాంమాలి హాజరయ్యారు.

## సీనియారిటీ పరిశీలన ..
## పునర్విభజనకు సిద్ధం కావాలి

సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు మాట్లాడుతూ త్వర లోనే ఉద్యోగుల పునర్విభజన ప్రక్రియ ఉండబోతోందని, ఉపాధ్యాయుల లోకల్ జిల్లా క్యాడర్ సీనియారిటీ ప్రాతిపదికన ఇది జరుగుతుందని పేర్కొ న్నారు. ఉపాధ్యాయులు తమ 'లీప్ యాప్'లో జనరేట్ అయ్యే సీనియా రిటీని నిరంతరం పరిశీలించుకోవాలని సూచించారు. అవసరమైతే మన్యం, విజయనగరం జిల్లాల్లో పని చేయడానికి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## టెట్ పేపర్ 2ఏ ఇంగ్లీష్ మెటీరియల్ ఆవిష్కరణ

రాష్ట్ర కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి జయరాం మాలి మాట్లాడుతూ 2025 సెప్టెంబర్ 1వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, 2010 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా 'టెట్' పాస్ అవ్వాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల మేలు కోసం యూటీఎఫ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ప్రత్యేక టెట్ నిర్వహణ డిమాండ్‌ను సాధించిందని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మకమైన "టెట్ పేపర్ 2ఏ ఇంగ్లీష్" స్టడీ మెటీరియల్ ను అతిథులు ఆవిష్కరించారు. మెటీరియల్‌ను ఇంగ్లీష్ ఉపాధ్యాయులు



రెయ్యి కృష్ణారావు, జన్ని సోమేశ్వరరావుకు అందజేశారు.

గతంలో 1986 సంవత్సరంలో స్పెషల్ క్వాలిఫైయింగ్ టెస్ట్(ఎస్ క్యూటీ) నిబంధన తెచ్చినప్పుడు కూడా యూటీఎఫ్ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిందని, ఇప్పుడు కూడా అదే మాదిరిగా టెట్ పాస్ అవ్వడం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక మెటీరియల్స్, కోచింగ్ క్లాసెస్ నిర్వహిస్తున్నామన్నారు. ఇది కేవలం యూటీఎఫ్‌కు మాత్రమే సాధ్యమని వారు స్పష్టం చేశారు.

## సభ్యత్వ నమోదుతోనే సంఘ బలోపేతం

జిల్లా పూర్వపు కార్యదర్శి గున్న రమేష్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి ఆర్థిక పరిపుష్టి ఎంతో అవసరమని, అప్పుడే సంఘ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించగలమని తెలిపారు. మండలంలోని అన్ని యాజమాన్య పాఠ శాలల్లో మెంబర్‌షిప్ క్యాంపెయిన్ నిర్వహించి, సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో మెంబర్‌షిప్ నమోదు చేసుకున్న కార్యకర్తలను అభి నందించారు.

సమావేశంలో జిల్లా పూర్వ కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మండల గౌరవ అధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, కోశాధికారి సోమనాథ్ సిస్టు, సహాధ్యక్షులు ధర్మార్పు కిరణ్, ప్రియాంక మహారాణ, సీపీఎస్ కన్వీనర్ గంట గోపాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు మజ్జి శివకేశవరావు, రెయ్యి కృష్ణారావు, తరిని సోమేశ్వరరావు, గున్న చంద్రశేఖర్, ప్రవీణ్ ప్రధానో, సీనియర్ ఉపాధ్యాయులు గున్న గంగాధర్, షాహుకారి రజిని తదితర ముఖ్య నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రైతాంగ సమస్యల పరిష్కారమే..
# ఏఐకేఎంఎస్ లక్ష్యం

- 25న శ్రీకాకుళంలో జిల్లా 11వ మహాసభలు
- రైతులు, ప్రజాస్వామికవాదులు పెద్దఎత్తున తరలి రావాలి
- రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు

**పలాస, జులై 18 (వార్త):** రైతాంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) శ్రీకాకుళం జిల్లా 11వ మహాసభలను ఈ నెల 25న శ్రీకాకుళంలోని కళింగ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా స్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయ వంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం వద్ద శనివారం మహాసభల కరపత్రాన్ని శనివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకెళ్లే విధానాలు రైతాంగ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని విమ ర్శించారు. రైతుల పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. రైతులకు గిట్టుబాటు ధర, సంపూర్ణ రుణమాఫీ, దున్నేవారికే భూమి, వ్యవసాయ రంగానికి తగిన బడ్జెట్ కేటా యింపులు, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి డిమాండ్ల సాధన కోసం ఏఐకేఎంఎస్ నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయాభివృద్ధికి వంశధార ప్రాజెక్టును ఇచ్ఛాపురం వరకు విస్తరించడంతో పాటు వంశధార--నాగావళి నదుల అనుసంధానం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లా విభజనతో నష్టపోయిన ఆదివాసీలకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయడం, వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడం, ఆది వాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడం వంటి అంశాలపై కూడా తమ సంఘం పోరాటం కొనసాగిస్తోందన్నారు. సోంపేట, కాకరాపల్లి ప్రాంతాల్లో కాలుష్యకర పరిశ్రమలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. జూలై 25న జరిగే జిల్లా మహాసభల్లో రైతాంగ సమస్యలు, సాగునీటి వనరుల అభివృద్ధి, వ్యవసాయ సంక్షోభ నివారణ, రైతు సంక్షేమం, భవి ష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమగ్రంగా చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకే ఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, మామిడి భీమా రావు, ఎస్.బంగ్లాకుమార్, మురిపింటి తాతారావు, కామేష్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఐఎఫ్ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జుత్తు వీరాస్వామి, కోశాధికారి పోత నపల్లి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన బీటీ రహదారుల ప్రారంభం



**ఆముదాలవలస, జులై 18(వార్త):** పొందూరు మండలంలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన పలు నూతన బీటీ రహదారులను ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. తండ్యం గ్రామం-మూడు మర్రి చెట్ల వరకు రూ.2 కోట్లతో, పొందూరు-లుట్టపేట వరకు రూ.1.2 కోట్లతో, పొందూరు--సర్వేశ్వరపురం వరకు రూ.2.4 కోట్లతో, గూనవపేట-మంగంపేట వరకు రూ.1 కోట్లతో బీటీ రహదారులు నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభి వృద్ధికి నాణ్యమైన రహదారులు కీలకమని, రైతులు తమ పంటలను మార్కెట్లకు వేగంగా తరలించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, విద్య, వైద్యం వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెర వేర్చేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిగురుపల్లి రామ్మోహన్, బలగ శంకర్ భాస్కర్, అన్నెపు రాము, అనకాపల్లి రంగనాయకులు, స్టేట్ డైరెక్టర్ విజయలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే పభుత్వ ధ్యేయం

**-జిల్లా పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధి బూర్లే లలితకుమారి**



**మెళియాపుట్టి, జులై 18(వార్త):** రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తు ఆ దశగా చర్యలు చేపడుతుందని శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధి బూర్లే లలితకుమారి తెలిపారు. శనివారం ఆమె పెద్ద లక్ష్మీపురం గ్రామంలో రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న వివిధ అంశాలు గూర్చి రైతులతో మాట్లాడారు. ఆమెతోపాటు బిజెపి నాయకులు వంజంగి రమేష్, దేశం పార్టీ సీనియర్ నాయకులు ఒట్టికూళ్ళ కళ్యాణ చక్రవర్తి (చక్రి), గంగరాజపురం గ్రామ మాజీ సర్పంచ్ వరిశ గణపతి, మడపాల శశిబుషన్, బూర్లే బుషి, మడపాల తిరుపతిరావు, పెద్దింటి గణపతి, అగ్రికల్చర్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్తులు తదితరులున్నారు. అలాగే పరుశురాంపురం పంచాయతీలో సైతం ఎరువుల పంపిణీ కార్యక్రమంలో చీపురుపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్ రావు, కూటమి నాయకులు రామూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆరవ మోహనరావు, రాజు, కిరణ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది కుసుమ, రైతులు తదితరులున్నారు.

## కంటి వ్యాధులపె అప్రమత్తంగా ఉండాలి



**ఆముదాలవలస, జులై 18(వార్త):** విద్యార్థులు తమ కంటి జబ్బుల పై అనునిత్యం అప్రమత్తంగాఉండాలని గుత్తావల్లి ఆసుపత్రి నేత్ర వైద్యాధికారి ఎం బాబురావు సూచించారు. ఈనెల 15, 17, 18, తేదీలలో బూర్జ మండలంలోని ఒపివాడ వెంకంపేట ఆదర్శ పాఠశాల ఆవరణలో 689 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 65 మంది విద్యార్థులకు కంటి అద్దాలు, దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించమని, వీరికి త్వరలో జిల్లా అందత్వ నివారణ సంస్థ ద్వారా కంటి అద్దాలు అందజేస్తారని ఆయన చెప్పారు. విద్యార్థులు ఉద్దేశించి విద్యార్థులు ఎక్కువగా సెల్ ఫోన్ వినియోగం తగ్గించాలని, పోషకాహారాలు ఎక్కువ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, వెలుతురులో చదవాలని విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి శ్రీనివాసరావు,హెచ్. ఏ.కృష్ణారావు, శ్రావణి, ఏఎన్ఎం, లీలా కుమారి, ఆశ వర్కర్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దానయ్య కుటుంబానికి రూ.22 వేల సాయం



**పలాస, జులై 18 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ గ్రామంలో ఇటీవల మరణించిన దుబ్బ దానయ్య కుటుంబాన్ని సోంపేటకి చెందిన యాదవ సంఘ నాయకులు, సోంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మద్దిలి నాగేశ్వరరావు, వారి బృందం శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.22,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బదకల జోగారావు, మడ్డు బుద్దేష్, ఉలాల హరికృష్ణ, ఇప్పిలి అప్పలస్వామి, మద్దిలి యుగంధర్, బూరాడ బాలకృష్ణ, బద్రి గోపాల్‌రావు, అంబటి కృష్ణమూర్తి, సవర రాంబాబు, డొక్కరి అప్పారావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో పఠనా సామర్థ్యం పెరగాలి

**మందస, జులై 18(వార్త):** విద్యార్థుల పఠనా సామర్థ్యం పెరగాలని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. మందస మండలంలోని అంబుగాం పంచాయతీ లింబుగాం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్శనలో భాగంగా పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. అదేవిధంగా పాఠశాలలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మమేకమై సలహాలు, సూచనలు చేశారు. పాఠశాల ఆయాకు కూడా తగుసూచనలు చేశారు. కార్యక్రమములో పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు.



# ఆమదాలవలసలో.. 'జగన్ 2.0 సూపర్ యాప్'




**ఆముదాలవలస, జులై 18(వార్త):** ఆముదాలవలసలో "జగన్ 2.0 సూపర్ యాప్" పోస్టర్‌ను శనివారం వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవి కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త తప్పనిసరిగా ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాల్సిందిగా కోరారు. పార్టీతో నిరంతరం అనుసంధానమై ఉండాలని పిలుపునిచ్చారు. ఈ యాప్ ద్వారా ప్రతీ కార్యకర్త తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయడంతో పాటు, పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, సమావేశాలు, ముఖ్య ప్రకటనలు, కార్యక్రమాల లైవ్ అప్డేట్ లను ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకత్వం వరకు ప్రతి ఒక్కరూ ఒకే వేదికపై ఉండే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించబడిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, కార్యకర్తలు ఎదుర్కొనే ఇబ్బందులు, పార్టీకి సంబంధించిన అంశాలను నేరుగా నాయకత్వానికి తెలియజేసే సౌకర్యం ఇందులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి జడ్పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు భవర మల్లేశ్వరరావు, మున్సిపాలిటీ అధ్యక్షులు పొడుగు శ్రీను, బుర్జ మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, రాష్ట్ర ఆర్‌టీఐ విభాగ కార్యదర్శి బద్రి రామారావు, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి దుంపల శ్యాం కుమార్, జిల్లా పబ్లిసిటీ విభాగ కార్యదర్శి పొన్నపురెడ్డి తవిటి నాయుడు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, రాష్ట్ర వాలంటరీ విభాగ కార్యదర్శి అట్లూరు రవికాంత్, అసెంబ్లీ బూత్ కమిటీ నువ్వే బాగా అధ్యక్షులు రమణమూర్తి, నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షులు మామిడి కిరణ్ కుమార్, మండల యువజన అధ్యక్షులు మామిడి శ్రీనివాస్, మున్సిపాలిటీ విద్యార్థి విభాగ అధ్యక్షులు సంజయ్, జిల్లా బీసీ విభాగ కార్యదర్శి మజ్జి నర్సింగ రావు, నియోజకవర్గ మున్సిపాలిటీ విభాగ అధ్యక్షులు పొదిలాపు తిరుపతిరావు, మండల పార్టీ కోర్ విభాగ కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు, మండల యువజన విభాగ ఉపాధ్యక్షులు లావేటి శ్రీనివాసరావు, ఇతర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

# ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు

**-కమిషనర్ ఐ.శ్రీనివాసులు**

**- పలాస పురపాలక సంఘంలో రెవెన్యూ, ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం**

**పలాస, జులై 18 (వార్త):** ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో వార్డు రెవెన్యూ కార్యదర్శులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ భూములు, రోడ్డు మార్గాలకు సంబంధించిన స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పట్టణ పరిధిలో పెరుగుతున్న అక్రమ లేఔట్లు, అనుమతులు లేకుండా చేపడుతున్న భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ హెచ్చరించారు. అనుమతులు పొందినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ అభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన నిర్మాణాల కోసం అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టౌన్ సర్వేయర్ రామ గణపతి, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు హర్ష, రమణ, వార్డు రెవెన్యూ కార్యదర్శులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అప్పలరాజుపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి




**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** స్థానిక వైస్సార్సీపీ కార్యాలయం లో వైస్సార్సీపీ శ్రేణులు , నాయకులు కలసి జగన్ 2.0 సూపర్ యాప్ లాంచింగ్ కార్యక్రమం జరిగింది. ఈ యాప్ వైస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులను అనుసంధానం చేయడానికి అదేవిదంగా ప్రజల సమస్యలను, ప్రభుత్వ వైపల్యాలను సోషల్ మీడియా వేదికలపై పోస్ట్ చేసిన వాటిని నిరోదించే ప్రయత్నం చేయడానికి వ్యవస్థలను అడ్డగోలుగ ఉపయోగించి శ్రేణుల గొంతును నొక్కిపెట్టే ప్రయత్నాలను నిరోదించేందుకు ఈ యాప్ అందుబాటులోకి తీసుకొని రావటం జరిగిందని నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి చెప్పారు.అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవలి పలాస నియోజకవర్గంలో దురదృష్టవసాత్తు జరిగిన బైక్ ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోయారని అటువంటి సంఘటన జరగటం బాధాకరం, ఆ ప్రమాదం జరిగిన తదుపరి డాక్టర్ అప్పలరాజు కుమారుడు వర్మను గాయల వలన బాధపడుతున్నా నిర్భంధం లోకి తీసుకొని అప్పలరాజు పై రాజకీయాంగా కక్ష సాధింపు చర్యలలో భాగంగా అతని కుటుంబం సభ్యులను వేదించడం బాధాకరం, అని అన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి వైద్య వృత్తిలో ఉన్నతమైన సేవలు అందించినవారు,తన పుట్టిన ప్రాంతానికి, ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో రాజకీయాలలో ప్రవేశించి అతి తక్కువ కాలంలో గా మంత్రిగా పలాస నియోజకవర్గం ప్రజలకు గొప్పగా సేవలందించినందుకు, ఉద్దానం ప్రాంత ప్రజలకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తెచ్చినందుకు, జిల్లాలో మొదటి భారీ పెట్టుబడి ద్వారా మూలపేట పోర్టు ఏర్పాటుకు కృషి చేసి వలసలు నివారణకు కృషి చేసినందుకు గాను ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులు అప్పలరాజు కుటుంబంపై ఇటువంటి కక్షపూరిత చర్యలకు దిగటం ఒక కొత్త అనారోగ్యకరమైన సాంప్రదాయం అని అన్నారు. ప్రస్తుత పలాస నియోజకవర్గం శాసనసభ్యులు గౌతు శిరీష ఒక ఉన్నతమైన కుటుంబం నుండి రాజకీయాలకు వచ్చి వారి తండ్రి , తా చూపిన దారిలో కాకుండా ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు పూనుకోవటం దురదృష్టం అని అన్నారు.

శిరీష తాత స్వతంత్ర సమరయోధులు గౌతు లచ్చన్న సుదీర్ఘ కాలం ప్రతి పక్ష నేత గా ఉన్నారని అన్నారు. ఈ నెల 14 న మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి , విశాఖపట్నంకు చెందిన మత్యకార సోదరులు సముద్రంలో వేటకు వెళ్లి మరణించిన వారి కుటుంబాలకు పరామర్శించటం అదేవిదంగా ఆర్థిక సహకారం అందించడం జరిగిందని , అ పర్యటన అనంతరం శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి అచ్చం నాయుడు, ఇచ్చాపురం శాసనసభ్యులు బెందాలం అశోక్ లు జగన్ ని ఉద్దేశించి అగౌరవంగా మాట్లాడటం అవాస్తవాలు మాట్లాడటాన్ని ఖండిస్తూ, వాస్తవాలు ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏమ్మెల్సీ నర్తు రామారావు , వైస్సార్సీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, శ్రీకాకుళం జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు ఉలాల భారతీ దివ్య,ఇచ్చాపురం, కంచిలి ఎంపీపీ లు బోర పుష్ప, పైల దేవదాసు రెడ్డి, ఇచ్చాపురం మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి,మాజీ డీసీఎంస్ అధ్యక్షులు సల్ల దేవరాజు, కవిటి ఎంపీపీ ప్రతినిధి, మండల పార్టీ అధ్యక్షులు కడియాల ప్రకాష్, కంచిలి, సోంపేట జడ్పీటీసీ ప్రతినిధులు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు ఇచ్చాపురం , మండల పార్టీ అధ్యక్షులు , ఆశి కృష్ణారెడ్డి, కారింగి మోహనరావు,సాలిన గాంధీ,ఆశి పురుషోత్తం రెడ్డి, దక్కత నూకయ్య రెడ్డి, ప్రత్తి అన్వేష్,యలమంచి నీలయ్య, బర్ల నాగభూషణం, పిలక దేవరాజు (సంతు), పలికల జయరాం,లోపింటి దీనభందు రెడ్డి, వడ్డిన తేజ, నీలాపు చంద్రయ్య, చాట్ల తిరుపతి రెడ్డి,సఫీ, మద్దు అభి, శ్రీకాంత్ గౌడో, సాడి జయరాం జుత్తు బేసింగి, ఈగల దేవదాసు, కిరణ్ బెహరా,ఖాజురు శంకర్, సావేటి ఆదినారాయణ కార్యాలయ ఇంచార్జ్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం ఆకస్మిక తనిఖీ

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం



**నరసన్నపేట, జులై 18 (వార్త):** బొరిగివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్న తీరును వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో జగన్మోహన్‌రావు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సూర్యకుమారి పాఠశాలను సందర్శించి వంటశాల పరిశుభ్రత, భోజనం తయారీ విధానం, ఆహార నాణ్యత, మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ తనిఖీలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**పోలాకి, జులై 18 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పోలాకి మండలం దీర్ఘాసి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించిన జెడ్పీ సీఈవో మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసి, నాణ్యతతో కూడిన భోజనం అందేలా సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించి ఆదర్శవంతమైన పాఠశాలలుగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.



## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు
## ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**పలాస, జులై 18 (వార్త):** స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలాస పట్టణంలోని శివాజీనగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు ఏపీటీపీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబురావు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత (స్వీయ శుభ్రత) యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పరిశుభ్రమైన వాతావరణంలోనే మంచి ఆరోగ్యం, మెరుగైన విద్యాభ్యాసం సాధ్యమవుతాయని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి పరిశుభ్రతను జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలందరూ తమ బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఉచితంగా అందించిన క్రీడా దుస్తులు (స్పోర్ట్స్ యూనిఫాంలు), షూస్‌ను విద్యార్థినులకు పంపిణీ చేశారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. పాఠశాల ప్రాంగణం, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించిన వజ్జ బాబురావు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, క్రీడలు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా భావి తరాలను మరింత సమర్థులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమరానికి సిద్ధంగా ఉండాలి

**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి గ్రామాల పర్యటన లో భాగంగా బొడ్డబడ, కొలిగాం, కీర్తిపురం, పాయితారి పంచాయతీ లలో వైస్సార్సీపీ కార్యకర్తలతో కలసి పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన కార్యక్రమాల గూర్చి చర్చించారు. కమిటీల నిర్మాణం పూర్తి చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి సమరానికి అవసరమైన సైన్యాన్ని సన్నద్ధం చెయ్యాలని కోరారు. ఎస్ ఐ అర్ ప్రక్రియ లో పెంచిన గడువును సద్వినియోగం చేసుకొని ఓటర్ల ను సంఖ్యను పెంచుకోవాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వం లోని వైస్సార్సీపీ ప్రభుత్వం నేడు చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం పనితీరుతో బేరీజు వేసుకొని మళ్ళీ జగన్మోహన్ రెడ్డి కావాలని కోరుకునే పరిస్థితి జగన్మోహన్ రెడ్డి గ పర్యటనలలో కనిపిస్తుందని దీనిని మనకు అనుకూలంగా మలచుకొని తొందర్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మన ప్రతినిధులని గెలిపించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎంపీపీ బోర పుష్ప, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి,మాజీ జడ్పీటీసీ దక్కత నూకయ్య రెడ్డి, జిల్లా ప్రతినిధులు ఆశి పురుషోత్తం రెడ్డి, ఇసురు పరశురామ్ రెడ్డి, ఇసురు యాదవుడు రెడ్డి, కారింగి మోహనరావు, బింగి నీలాద్రి, వడ్డిన తేజ, వలపల వెంకటరమణ, లోపింటి దీనభందు రెడ్డి, సంతోష్ మొండోలో, లిట్టు పాడి, ఉదయ బెహరా, ప్రియ, గందు మహాపాత్రో, బొబ్బిలి దేవరాజు గానాల వెంకటస్వామి, జి.చిరంజీవి, జి.మన్మధరావు, వి దుర్యోధన గానాల తారకేసు, ప్రకాష్ మహాపాత్రో, పూర్ణాచంద్ర,ఆర్ భీమయ్య, డి దుర్యోధన, డి. ధర్మారావు, గానాల దుర్యోధన,మొన్ను మహారణ, బిజొయో మూలి, రాపాక సింహాద్రి, కడియాల పకీరు, బొబ్బిలి చలపతి, ఏం. గంగయ్య, దోను, రామచంద్ర పాడి, కేశవో బెహరా, సంతోష్ ఢిల్లీ బెహరా,గానాల కుమారస్వామి, అప్పన్న బాడీత్య, సూర్యనారాయణ దాస్, కురా బెహరా, కలియ బెహరా, బిద్యదర్ బెహరా, జగదీష్ బెహరా, శ్రీధర్ పాడి, అర్జున్ బాడీత్య తదితరులు పాల్గొన్నారు.



## విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారంపై కఠిన చర్యలు తప్పవు

-కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని హెచ్చరిక



**పలాస, జులై 18 (వార్త):** సోషల్ మీడియా వేదికలను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెడితే, ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని అవమానకరమైన పోస్టులు, అసత్య ప్రచారాలు చేయవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని హెచ్చరించారు. కాశీబుగ్గ డిఎస్పీ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఎవరిపైనైనా విమర్శలు చేయాల్సి వచ్చినప్పుడు అవి హుందాగా, గౌరవప్రదంగా ఉండాలని ఆమె తెలిపారు. వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు, అవమానకర పోస్టులు లేదా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారం చేయడం, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలను పోలీసులు నిశితంగా గమనిస్తున్నారని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించినా, తప్పుడు ప్రచారం చేసినా లేదా సోషల్ మీడియాను దుర్వినియోగం చేసినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియాను బాధ్యతతో వినియోగిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాలను పరిరక్షించేలా వ్యవహరించాలని ఆమె కోరారు. సందేహాస్పద పోస్టులను షేర్ చేసే ముందు వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలాస రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, మందస ఎస్ఐ కృష్ణ ప్రసాద్, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్ తదితరులు పాల్గొన్నారు.

## దానయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



**సోంపేట, జులై 18(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల కాపరి దుబ్బ దానయ్యకు సోంపేట మండలం మా కన్నపురం గ్రామానికి చెందిన ఎమ్మెన్నార్ యువసేన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం 22 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచిలి ఏఎంసీ చైర్పర్సన్ ప్రతినిధి మద్దిల నాగేశ్వరరావు ఉలాల హరికృష్ణ, బతకల జోగారావు, మద్దిల యుగంధర్, ఇప్పిలి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బెల్లుపడ కాలనీలో కార్డెన్ సెర్చ్




**ఇచ్ఛాపురం, జులై 18(వార్త):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. చిన్నం నాయుడు , సర్కిల్ సిబ్బంది, సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మంగరాజు సర్కిల్ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం బెల్లుపడకాలనీ లో కార్డెన్ చర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా తనిఖీలు నిర్వహించారు.. సరైన ఆధారాలు లేనటువంటి 15 మోటార్ సైకిల్ ను స్వాధీనపర్చుకోన్నారు. అలానే వార్డు పరిధిలో గల ప్రజలు, యువత తో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు

## భూసార పరీక్షలపై అవగాహన

**మెళియాపుట్టి, జులై 18(వార్త):** పాఠశాల స్థాయి నుంచి భూసార పరీక్షలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉపసంచాలకులు ఆర్ శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రంవారి ఆధ్వర్యంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మట్టి నమూనాలు తీసే విధానం, ల్యాబ్ లో పరీక్ష చేసే విధానం, మట్టి నమూనాలు ఆవశ్యకత, సమస్యాత్మక పొలాలకు పరిష్కారాలు తదితర వాటి గురించి మెళియాపుట్టి మండల కేంద్రంలో గల ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శనివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించే విధానము, అలాగే మట్టి నమూనా పరీక్ష కేంద్రం నందు మట్టి నమూనాలు పరీక్ష చేసే విధానం, భూసార పరీక్షలు వల్ల కలిగే ఉపయోగాలు, రానున్న భవిష్యత్తు కాలంలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయం సాగు చేసే విధానాలు ఉన్నాయని, భూసార పరీక్షల ఆధారంగా పొలాలకు రైతులు ఎరువులు వాడుకోవాలని అలా చేయడం వల్ల వాసక సమతుల్యత పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటారని అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆర్. శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం, రాగోలు శాస్త్రవేత్త డా. పి. ఉదయబాబు, కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస శాస్త్రవేత్త డా. ఎస్. కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖధికారులు వై. సురేష్, ఎస్. దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జరిత, ఏకలవ్యవ స్కూల్ ప్రిన్సిపాల్ , సైన్స్ టీచర్స్, విద్యార్థులు తదితరులున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగస్తులు కండి

## ఎమ్మెల్యే రమణమూర్తి మొక్కలు నాటిన బగ్గు

### - పెద్ద బొరిగివలస జిల్లా పరిషత్ పాఠశాలలో పచ్చదనం కార్యక్రమం



**నరసన్నపేట, జులై 18 (వార్త):** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించి పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దడం అంతకంటే ముఖ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం నరసన్నపేట మండలం పెద్ద బొరిగివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే అలవాటు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా సంరక్షించి పెద్ద వృక్షంగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలందరిపైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తమ పుట్టినరోజు లేదా జీవితంలో ప్రత్యేకమైన రోజున కనీసం ఒక మొక్కను నాటి దానిని దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు. పాఠశాల ఆవరణలను పచ్చదనంతో నింపడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు ఏకాగ్రత, ఆరోగ్యకరమైన ఆలోచనలు పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గొద్దు చిట్టిబాబు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు, జిల్లా తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి బలగ భారతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసన్నపేట డిప్యూటీ ఎంపీడీవోగా జగన్మోహనరావు



**నరసన్నపేట, జులై 18 (వార్త):** నరసన్నపేట మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా పిల్లా జగన్మోహనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయవాడలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై నరసన్నపేటకు వచ్చినట్లు తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన ఏ.రమేష్ బదిలీపై గార మండలానికి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జగన్మోహనరావు మాట్లాడుతూ, మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారం అందించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. స్థానిక అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు అందజేశారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



**పలాస, జులై 18 (వార్త):** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి, సుప్రీంకోర్ట్ తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30 న కలక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో మున్సిపల్ కార్మికులు యావన్మంది పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి, యూనియన్ నాయకులు కె వెంకటి, యం రవి పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ మస్తర్ పాయింట్ వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శాశ్వత పనులలో శాశ్వత పద్ధతులలో ఉద్యోగాలు నియామకాలు ఉండాలని, సుప్రీం కోర్ట్ తీర్పు చెప్పినా ప్రభుత్వం అమలు చేయకుండా సోద్యం చూస్తుందని అన్నారు. కార్మికులు చేత వెట్టి చాకిరీ చేయించుకోవడం చంద్రబాబుకు అలవాటు అయిపోయిందని విమర్శించారు. అందుకే కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్స్ ముందుగా ఈ రాష్ట్రంలో అమలు చేసేందుకు ఉబలాట పడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి ఐదు ఏళ్లకు ఒక సారి వేతనాలు సవరించాల్సి ఉన్నప్పటికి షెడ్యూల్ పరిశ్రమలలో పందొమ్మిది ఏళ్లుగా వేతన బోర్డు నియమించడం లేదని అన్నారు. మున్సిపాలిటీలలో వేతనాలు సవరించి ఏడేళ్లు అయిందని తెలిపారు. అందుకే వేతనాలు సవరించాలని, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, 12 వ పే కమిషన్ వెంటనే వెయ్యాలని, ఈ నెల 30 న జరిగే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె ఈశ్వరరావు, బాలకృష్ణ, ఉమా మోహన్, ప్రకాష్ ముఖి బాబురావు, శకుంతల, గురువారి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ విజయవంతం



**పలాస, జులై 18 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుభ్రతపై అవగాహన కల్పించే ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వచ్ఛతే సేవ, ప్లాస్టిక్ రహిత సమాజం, పరిసరాల పరిరక్షణపై నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా శుభ్రమైన పరిసరాలు, తడి-పొడి చెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ఇంటి వద్దనే చెత్తను వేరు చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, పలాస పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సామాజిక బాధ్యతగా పలాస క్యాజు మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో మొక్కలు నాటే కార్యక్రమం అదే విధంగా పరిసరాలని శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థలతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శ్రీనివాస జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్త, సింగిరి సతీష్, తంగుడు కామేశ్వరరావు, చుండూరు మహేష్, పట్నాల శ్రీనివాసరావు, కోటి శశి తదితరులు పాల్గొన్నారు.

## సోనమ్ అక్రమ అరెస్టును ఖండించండి

**పలాస, జులై 18 (వార్త):** సోనమ్ వాంగ్ చుక్ శాంతియుత దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆయనను అక్రమ అరెస్టు చేయడాన్ని ఖండించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యు) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పర్యావరణవేత్త, రామ్ మెగసెసే అవార్డు గ్రహీత సోనం వాంగ్ చుక్ గత నెల ఆఖరి నుండి 20 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. సోనం వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం విచారకరం. మోడీ సర్కార్ పాలన కేవలం కార్పొరేట్లకు అనుకూలంగా సాగుతోందని, అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ లక్షలాదిమంది విద్యార్థుల్లో నిరాశను నింపిందని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్నప్పటికీ ప్రధాని మోడీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇండియా సరిహద్దుల్లో చొరబాట్లను వ్యతిరేకించి, సోనమ్ వాంగ్ చుక్ దీక్షలకు పీడీఎస్ యూ మద్దతు పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఇప్పుడు దేశం కోసం, న్యాయం కోసం, విద్యార్థుల కోసం నిరవధిక దీక్ష చేస్తున్నారు. పాశవిక నరేంద్ర మోడీ ప్రభుత్వం సోనం వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కర్కశంగా వ్యవహరిస్తున్నది. మోడీ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. సోనం వాంగ్ చుక్ కు ఏదైనా జరిగితే ప్రధాని మోడీనే బాధ్యత వహించాలని హెచ్చరిస్తున్నాం. తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

## జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ




**నరసన్నపేట, జులై 18 (వార్త):** నరసన్నపేటలోని వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో శనివారం జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్మాత్మకంగా రూపకల్పన చేసిన ఈ యాప్‌ను ప్రజలకు చేరువ చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో జగన్ 2.0 సూపర్ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పార్టీ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, యాప్‌ను గ్రామస్థాయిలో ప్రజలకు పరిచయం చేయాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతి నాయకుడు, కార్యకర్త యాప్‌ను వినియోగిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నాయకులు యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

## తొగిరి ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల



**సారవకోట, జులై 18 (వార్త):** ఇటీవల పలు గ్రామాల్లో ఎత్తిపోతల పథకాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనాలకు గురవుతున్న నేపథ్యంలో తొగిరి ఎత్తిపోతల పథకానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే క్రేన్ సహాయంతో తొలగించి భద్రపరిచినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి, సారవకోట మండల పార్టీ రథసారథి ధర్మాన తేజ్‌కుమార్ తెలిపారు. రైతుల సాగు పనులు ప్రారంభం కావడంతో తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తిపోతల పథకం వద్ద ఏర్పాటు చేసి, అవసరమైన తాత్కాలిక మరమ్మత్తులు పూర్తి చేసిన అనంతరం శుక్రవారం నుంచి తొగిరి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మాన తేజ్‌కుమార్ మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా దానిని గ్రామంలో భద్రపరిచామని తెలిపారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి, నీటి సరఫరా పునరుద్ధరించామని చెప్పారు. సాగునీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు సజావుగా సాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో సహకరించిన ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు పిల్లా నందకిషోర్, కిన్నెరవాడ మాజీ సర్పంచ్ తర్ర లచ్చుము, చల్ల జనార్ధన్‌రావు, తొగిరి, కిన్నెరవాడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## హంసరాళిలో ప్రమాదకరంగా కాలువలు

### - బాగు చేయాలని ప్రజల వినతి

**మందస, జులై 18(వార్త):** హంసరాళిలో కాలువలు ప్రమాదకరంగా మారాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, రోగులు కాలువలు దాటలేక ప్రమాదాలకు గురవుతున్నారని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువులు కూడా భద్రతలేని ఈ కాలువల్లో పడిపోతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని నర్సింగపురం సచివాలయం పరిధిలో హంసరాళి ఉంది. పంచాయతీకి హంసరాళి కేంద్రంగానే ఉంది. హంసరాళికి మంచిపేరుంది. కానీ, ప్రమాదాలకు నెలవుగా మారిన కాలువలను మాత్రం బాగు చేసే నాథుడు కరవయ్యాడని హంసరాళి యువజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి కాలువలు నిర్మించి, వాటిపై సిమెంట్ పలకలు వేస్తే.. ప్రమాదాలు జరుగవు. అందుకు విరుద్ధంగా కాలువలు నిర్మించి, వాటిపై సిమెంట్ పలకలు వేయడం మరిచిపోయారు. దీంతో హంసరాళి యువజన సంఘం నాయకులు సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం ద్వారా సమస్యను వివరించారు.

తక్షణమే కాలువలపై సిమెంట్ పలకలు వేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో నీటి పైపులు, కుళాయిలు సక్రమంగా పని చేయడంలేదన్నారు. కొన్ని చోట్ల నీరు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, ఈ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



## శాతవాహన విద్యాసంస్థ విజయ కేతనం

### - 'షైనింగ్ స్టార్' అవార్డుకు శివానిపండా ఎంపిక



**మందస, జులై 18(వార్త):** విద్యార్థులను ఉత్తమ ఫలితాల దిశగా తీర్చిదిద్దుతూ వరుస విజయాలతో తన ప్రత్యేకతను చాటుకుంటున్న హరిపురంలోని "శాతవాహన విద్యాసంస్థల" ఖాతాలో మరో అరుదైన ఘనత చేరింది. కళాశాలలో ఇంటర్ సి.ఈ.సి. విభాగంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మందస గ్రామానికి చెందిన శివాని పండా తన విద్యా ప్రతిభతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రదానం చేసే "షైనింగ్ స్టార్" అవార్డుకు ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన "షైనింగ్ స్టార్" అవార్డు గ్రహీతల జాబితాలో శివానిపండా ఎంపిక కావడంతో శనివారం శాతవాహన కళాశాలలో ఆమెను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ఏవో బి.శివ మాట్లాడుతూ, నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విద్యార్థి కేంద్రిత బోధనతో శాతవాహన కళాశాల ప్రతి సంవత్సరం విశిష్ట ఫలితాలు సాధిస్తోందన్నారు. శివాని సాధించిన ఘనత కళాశాలకు గర్వకారణమని, ఆమె అడుగుజాడల్లో మరింత మంది విద్యార్థులు నడిచి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. శివాని పండా ఈ నెల 20వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించే "షైనింగ్ స్టార్" అవార్డు ప్రధాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిష్మాత్మక "షైనింగ్ స్టార్" అవార్డును అందుకోనుంది. ఈ సందర్భంగా శాతవాహన ఇంటర్ మరియు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ బి. దుదిష్టి నాయుడు, ఎం. భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి రాష్ట్ర స్థాయి గుర్తింపు సాధించేలా తీర్చిదిద్దడం కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. శివాని సాధించిన ఈ విజయం కళాశాల అధ్యాపకుల అంకితభావానికి, విద్యార్థుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు శివానికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కుల, రాజకీయ రంగు పులమవద్దు

### -బాధిత కుటుంబానికి న్యాయం, ఆర్థిక సహాయం అందించాలి

### - కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బద్రి సీతమ్మ యాదవ్



**పలాస, జులై 18 (వార్త):** పలాస నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాద ఘటనను కొందరు రాజకీయ, కుల కోణంలో చూసి సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గ బూత్ సమన్వయకర్త బద్రి సీతమ్మ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పలాసలో ఆమె విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదాలు, ప్రమాద మరణాలు ఎవరూ కావాలని కోరుకోరని అన్నారు. అలాంటి విషాద ఘటన జరిగినప్పుడు బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం, వారికి అండగా నిలవడమే మానవత్వం అని తెలిపారు. బాధిత యాదవ్ కుటుంబానికి ధైర్యం చెప్పి, తప్పు ఎవరి వైపు ఉన్నా దాన్ని ఒప్పుకుని సామరస్యంగా, శాంతియుతంగా పరిష్కరించుకోవడమే కనీస బాధ్యత అని స్పష్టం చేశారు. ఒక దురదృష్టకర సంఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం గానీ, కులాల మధ్య చిచ్చు పెట్టి విభేదాలు సృష్టించడం గానీ సమాజానికి ఏమాత్రం మంచిది కాదని ఆమె అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు ఇతర రాజకీయ నాయకులు కూడా ఈ ఘటనను రాజకీయ కోణంలో కాకుండా కేవలం న్యాయ కోణంలో చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించి సమాజంలో శాంతిని కాపాడాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. తప్పుడు కేసులు పెట్టి ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడం వల్ల సమస్య పరిష్కారం కాదని, పైగా రెండు వర్గాల మధ్య దూరం మరింత పెరుగుతుందని బద్రి సీతమ్మ యాదవ్ అభిప్రాయపడ్డారు. గతంలో డాక్టర్ అప్పలరాజు యాదవ్ సామాజిక వర్గానికి ఇచ్చిన గౌరవాన్ని, చూపిన ఆప్యాయతను గుర్తు చేస్తూ, ఇరువర్గాల పెద్దలు కూర్చొని చర్చించాలని సూచించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించడం, వారి జీవనానికి అవసరమైన ఆర్థిక సహాయం చేసేలా చర్యలు తీసుకోవడమే ఇప్పుడు చేయాల్సిన పని అని అన్నారు. చట్టం తన పని తాను చేస్తుండగా, స్థానికంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీసు అధికారులను కోరారు. భయంతోనో, అనుకోకుండా జరిగిన పొరపాటును పెద్ద మనసుతో క్షమించి ముందుకు సాగాలని రెండు వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ నాయకులు సంయమనం పాటించి, ప్రజల్లో సామరస్యం పెంచేలా మాట్లాడాలని హితవు పలికారు. చివరగా రాజకీయాలకు అతీతంగా బాధిత గొర్లె కాపరి కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా, వారికి ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని బద్రి సీతమ్మ యాదవ్ డిమాండ్ చేశారు.

## మెనూ అమలు, ఆహార నాణ్యతను పరిశీలించిన ఎంఈఓలు



**సారవకోట, జులై 18 (వార్త):** మాలువ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు) వెంకటరమణ, భూలక్ష్మి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. వంటశాల నిర్వహణ, పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానాన్ని సైతం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546